ANDHRA JYOTI VIJAYAWADA. Regd. No. H 543

ఉదయం ★★★

Telephone 4343

చందా రేట్లు

	ఏజెంట్ ద్వారా రూ.పై.	పోస్టుద్వారా రూ.
ఒక మాసానికి	4-62	5-34
మూడు మాసాలకు	13-86	16-02
ఆరు మాసాలకు	27-72	32-04
సంవత్సరానికి	55-44	64-08

సర్క్యులేషన్ మేనేజర్,
ఆంధ్రజ్యోతి, పో. బా. నెం. 334, విజయవాడ-2

ఆంధ్రజ్యోతి

ఎడిటర్: నార్ల వెంకటేశ్వరరావు

121336

సంపుటి 11 :: సంచిక 344

విజయవాడ, జూన్ 17, 1971 గురువారం

6 పేజీలు :: 15 పైసలు

ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక
★
మీ కుటుంబానికి ఉత్తమ కాలక్షేప సాధనం
వారం వారం తప్పక చదవండి
★
పేజీలు : 64 ★ వెల : 40 పైసలు

రాష్ట్ర ఆర్థిక మంత్రితో ఉద్యోగుల చర్చల వైఫల్యం

సరిహద్దు భద్రతా దళాల అప్రమత్తత

ఎట్టి పరిస్థితిని అయినా ఎదుర్కొనగలస్థితిలో వున్నట్లు శ్రీ జగ్‌జీవన్‌రామ్ వివరణ

న్యూఢిల్లీ, జూన్ 16—

తూర్పు బెంగాల్ సరిహద్దులలో ఎట్టి పరిస్థితిని అయినా ఎదుర్కొనగలరీతిగా భారత సరిహద్దు భద్రతాదళాలు పటిష్ఠంగాను, సమర్థంగా వున్నాయని రక్షణ శాఖ మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ రాజ్యసభలో చెప్పారు.

అక్రమ ప్రవేశానికి ప్రయత్నించే వారిని తరిమి వేయాలని సైన్యానికి ఆదేశించడం జరిగిందని ఆయన విశద పరచారు. అయితే ఇంతవరకు అటువంటి పరిస్థితి రాలేదని ఆయన అన్నారు. సరిహద్దు భద్రతా దళాలు అవసరమైన చర్యలను గైకొంటున్నవని ఆయన పేర్కొన్నారు.

పశ్చిమ సరిహద్దులలో పాకిస్తాన్ సైనిక చర్యలను గురించి ప్రస్తావించి రెండు వైపుల అప్పుడప్పుడు సైనికుల విన్యాసాలు జరుగుతున్నాయని శ్రీ జగ్‌జీవన్‌రామ్ డాక్టర్ బి. ఎన్. ఆంథోనీకి చెప్పారు. బహుశ ఈవలి వైపు ప్రజలను భయపెట్టడానికే పాకిస్తాన్ ఇట్టి చర్యలకు పాల్పడి వుండవచ్చునని, [illegible] వారి బెదిరింపులతో మనకు బాగా తెలుసునని ఆయన అన్నాడు.

శ్రీ కళ్యాణ్ రాయ్, శ్రీ డి. ఎమ్. సేన్ గుప్తా, శ్రీ ఆర్. టి. పార్థసారధి సైనిక చర్యలపట్ల ఆందోళన వెలిబుచ్చారు.

సరిహద్దు ప్రాంతాలలో పాకిస్తాన్ ఏజెంట్లు జరుపుతున్న గూఢచారి చర్యల నిరోధానికి అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తున్నారని లోకసభలో హోం శాఖ స్టేట్‌మంత్రి శ్రీ ఆర్. ఎ.. మీర్ధా చెప్పారు.

చైనా అణ్వాయుధ శక్తి

చైనా అణ్వాయుధ శక్తిలో చెప్పుకోతగిన పరిణామం ఏమీలేదని రక్షణ మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ రాజ్యసభలో శ్రీ కె. సి. పాండ్య ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

చైనా అణ్వాయుధ సంపదవల్ల ఏర్పడే చిక్కులను గురించి ప్రభుత్వం ఎప్పటి కప్పుడు పరిశీలిస్తున్నదని ఆయన అన్నారు.

ఐ. ఎ. ఎస్. పరీక్షలు

ఐ. ఎ. ఎస్. పరీక్షలకు హాజరయ్యే ఫస్టు క్లాస్ గ్రాడ్యుయేట్ల సంఖ్య తగ్గడానికి గల కారణాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని హోంమంత్రి శ్రీ ఆర్. ఎన్. మీర్ధా లోకసభలో చెప్పారు.

కొంతకాలంక్రితం జరిగిన పరిశీలనవల్ల ఈ విషయం తెలిసిందని, ఈ పరిస్థితిని తొలగించడానికి తగిన చర్యలను గైకొనే విషయం, పరిశీలన ఫలితాలను బట్టి నిర్ణయిస్తామని ఆయన శ్రీ ఎస్. ఎస్. మిశ్రా ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

ఎన్. జి. ఓ. ల ఆర్థిక సౌకర్యాలను గురించి ముఖ్యమంత్రి ఏకపక్ష ప్రకటన చేయవచ్చునట

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో, ఆర్థికశాఖ సెక్రటరీతో శ్రీ బ్రహ్మానందరెడ్డి చర్చలు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, జూన్ 16—

రాష్ట్ర ప్రభుత్వం తన ఉద్యోగులకు జీతాల పెంపుదల విషయమై నేడు ప్రకటన చేయవలసి వుంది. కాని ఆర్థికమంత్రి శ్రీ విజయభాస్కరరెడ్డి, ఉద్యోగుల ప్రతినిధులు నేడు ఒక ఒప్పందానికి రాలేకపోయారు.

ఆర్థిక మంత్రికి, ఉద్యోగుల ప్రతినిధులకు మధ్య చర్చలు విఫలమైన దృష్ట్యా, ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల విషయమై ఏకపక్షంగా ప్రకటన చేయవచ్చునని అనుకొంటున్నారు.

ఉద్యోగులు సమ్మెను విరమించబోయే ముందు వారి ఆర్థిక ప్రయోజనాల సమస్యను పూర్తిగా ముఖ్యమంత్రి నిర్ణయానికి విడిచిపెట్టిన సంగతి పాఠకులకు తెలిసినదే.

ముఖ్యమంత్రి నేటిసాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆర్థిక శాఖ కార్యదర్శులతో సంభాషణలు జరపనున్నారు.

ముఖ్యమంత్రి ఈ రోజునగాని లేదా రెండు మూడు రోజుల అనంతరంగాని ఉద్యోగులకు కల్పించనున్న ఆర్థిక సౌకర్యం గురించి ప్రకటన చేస్తారని ఆర్థిక మంత్రి తెలిపారు.

ముఖ్యమంత్రి ఈ సాయంత్రమే ఒక ప్రకటన చేయలేకపోతే, ఆ కల్పించే ఆర్థిక సౌకర్యాల గురించి ప్రకటన చేయడానికి రెండు మూడు రోజులు ఆలస్యం దేనికి అని విలేకరులు ప్రశ్నించారు. దానికి ఆర్థిక మంత్రి వివరణ ఇవ్వలేకపోయారు.

ఆర్థిక మంత్రితో చర్చల అనంతరం బయటకువస్తూ ఉద్యోగుల ప్రతినిధులు శ్రీ రామచంద్రారెడ్డి (తెలంగాణా సంఘాల నాయకుడు), బి. రామకృష్ణారావు (ఆంధ్ర సంఘాల నాయకుడు) ప్రభుత్వం ప్రతిపాదనలు ఉద్యోగులకు సంతృప్తికరంగా లేవని పత్రికలవారికి చెప్పారు.

శ్రీ రామకృష్ణారావు ప్రకటన

శ్రీ రామకృష్ణారావు తరువాత ఒక ప్రకటన చేస్తూ ఇలా పేర్కొన్నారు : "నేటి ఉదయం ఆర్థిక మంత్రిని వేరే కలుసుకొన్నాం. మా చర్చలలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ కార్యదర్శి కూడా పాల్గొన్నారు.

"ఆర్థిక ప్రయోజనాల విషయమై మా కోరిక లన్నింటిని ముఖ్యమంత్రికి నివేదించుకొన్నామని ఆర్థిక మంత్రికి చెప్పాం. ఇక ఈ సమస్యపై మరొకసారి చర్చలు అనవసరం అని కూడా చెప్పాం. అయినా మాతో చర్చించాలని ఆర్థిక మంత్రి కోరారు. అయినా, నేటి చర్చలు నిష్ఫలం. ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చి, దానినే అంటిపెట్టుకొని వున్నది. కాని, ఏ మాత్రం తగ్గడానికి ఇష్టపడ లేదు.

"ప్రభుత్వం అంచనావేసుకొన్న లెక్కలను ఎంత తారుమారు చేసుకొన్నా, తాత్కాలిక భృతి. ఇంటిఅద్దె. అలవెన్సు, సిటీ అలవెన్సు మున్నగు కోరికలన్నింటినీ ఈ మొత్తంలోనే ఇరికించడానికి ఎంత ప్రయత్నించినా, అది ఎవరినీ సంతృప్తిపరచని రాజీకు మాత్రమే దారితీస్తుందని" అయన అన్నారు.

5 వ పేజీలో
ఆంధ్ర మెట్రిక్
పరీక్షా ఫలితాలు

విదేశీ ధనం స్వీకరణపై ఆంక్షలు

ప్రభుత్వం బిల్లు తయారుచేసిందట

న్యూఢిల్లీ, జూన్ 16— దేశంలోని నానా పత్రికలు విదేశీధనం స్వీకరించడంపై తగిన ఆంక్షలు విధించడానికి ప్రభుత్వం ఒక బిలును రూపొందించినట్లు లోకసభలో శ్రీ కె. సి. పంత్ ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానమిస్తూ తెలిపారు.

ఈ బిలులో రూపొందించిన సూత్రాలపై త్వరలో ప్రతిపక్ష నాయకులతో చర్చలు జరపగలనని ఆయన చెప్పారు.

"బంగ్లా ప్రభుత్వాన్ని గుర్తించాలి"

120 మంది బ్రిటిష్ లేబర్ ఎం. పి. ల విజ్ఞప్తి

లండన్, జూన్ 16—పాకిస్తాన్ ప్రభుత్వం తూర్పు బెంగాల్‌లో మూకుమ్మడి హత్యాకాండ సాగిస్తున్నదని బ్రిటిష్ పార్లమెంట్‌లోని 120 మందికి పైగా లేబర్ పార్టీ సభ్యులు ఒక తీర్మానంలో ఆరోపించారు.

వీరందరూ తీర్మానంపై సంతకాలు చేశారు.

ఈ తీర్మానాన్ని మాజీ క్యాబినెట్ మంత్రి జాన్ స్టోన్‌హౌస్ తయారు చేశారు.

ఐక్యరాజ్యసమితి జోక్యం కల్పించుకోవాలని తీర్మానం కోరింది. తూర్పు బెంగాల్ పరిస్థితి అంతర్జాతీయ శాంతికి ప్రమాదకరమని, జనీవా సభ నిర్ణయాలకు, సంప్రదాయాలకు విరుద్ధమైనదని తీర్మానం చెప్పింది.

తూర్పు బెంగాల్ ప్రజల స్వయంనిర్ణయ హక్కు సాధనకు మార్గంగా బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని గుర్తించాలని కూడా లేబర్ సభ్యులు సిఫారసు చేశారు.

ఇటలీ ప్రధానికి భారత ప్రధాని లేఖ

శరణార్థుల సమస్య గురించి

రోమ్, జూన్ 16 — తూర్పు బెంగాల్ శరణార్థులు భారత దేశానికి పెద్ద సంఖ్యలో వలస వస్తున్నందున భారతదేశానికి ఎదురవుతున్న సమస్యల తీవ్ర స్వభావం గురించి వివరిస్తూ, ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి ఇటలీ ప్రధాన మంత్రి ఎమిలియో కొలంబోకు వ్యక్తిగత హోదాలో ఒక సందేశం పంపించారు.

ఈ లేఖను ఇక్కడికి వచ్చిన భారత పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ మొయినుల్ హక్ చౌదరి ఇటలీ ప్రధానికి అందిచేశారు.

మద్రాసు-కలకత్తా జాతీయ రహదారి అభివృద్ధి

నాల్గవ ప్రణాళికా కాలంలో పూర్తిఅవుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నరసింగరావు వెల్లడి

హైదరాబాద్, జూన్ 16—

రాష్ట్రం నుంచి పోతున్న మద్రాసు-కలకత్తా గ్రాండ్ ట్రంక్ రోడ్డును నాల్గవ ప్రణాళికా కాలం చివరకు రెండు వాహనాలు ఒకేసారి పోవడానికి వీలుగా వెడల్పు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ జె. వి. నరసింగరావు నేడిక్కడ చెప్పారు

ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, మద్రాసు-బెంగుళూరు, విజయవాడ-హైదరాబాద్-షోలాపూర్ జాతీయ రహదార్లను కూడా ఆదేవిధంగా వెడల్పుచేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. కర్నూలు-హైదరాబాద్, కర్నూలు-అనంతపురం రహదార్లనుకూడా వెడల్పుచేస్తారు. విజయనగరం-జగదల్ జాతీయ రహదారి వెడల్పు చేసే కార్యక్రమం నాల్గవ ప్రణాళిక చివరకు 75 శాతం పూర్తి అవుతుందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు.

రాష్ట్రంలోని జాతీయ రహదార్ల మెరుగు పరచడం విశాలపరచడం కార్యక్రమాన్ని సమీక్షిస్తూ, వాటికి 47 కోట్ల రూపాయల వ్యయంకాగల పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని, అందులో 25 కోట్లరూపాయలు విడుదలచేయడం జరిగిందని, కార్యక్రమం అమలు జరుగుతున్నదని ఉప ముఖ్యమంత్రి చెప్పారు.

పాకిస్తాన్ గూఢచారులు

ఇండియాలో ప్రవేశించకుండా నిరోధించే చర్యలు గైకొన్నట్లు కేంద్రమంత్రి వివరణ

న్యూఢిల్లీ, జూన్ 16—

పాకిస్తాన్ గూఢచారులు ఇండియాలో ప్రవేశించకుండా నిరోధించడానికి అన్ని చర్యలను గైకొన్నట్లు నేడు లోకసభలో కేంద్ర హోమ్ శాఖ స్టేట్ మంత్రి శ్రీ రామ్‌నివాస్‌మీర్ధా హామీ నిచ్చారు.

శ్రీ పి. గంగా దేబ్ ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ, రాన్ ఆఫ్ కచ్ ప్రాంతంలో పాకిస్తానీ గూఢచారిని ఇటీవల అరెస్టు చేసినట్లు వచ్చిన వార్తను ఖండించారు.

ఆ ప్రాంతంలో పశువుల దొంగ రవాణా చేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

పాకిస్తాన్ గూఢచారులు ఇండియాలో ప్రవేశించకుండా నిరోధించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వందని, అయినప్పటికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వాలకు సహాయం చేయడం జరుగుతున్నదని తెలిపారు.

భారత గస్తీ కేంద్రంపై పాకిస్తాన్ కాల్పులు

కృష్ణనగర్, జూన్ 16 — ఇక్కడికి 80 కిలోమీటర్ల దూరంలోని షల్‌బరి గస్తీ కేంద్రంపై పాకిస్తాన్ సైనికులు నేడు కాల్పులు జరిపారు

భారత సరిహద్దు భద్రతా దళం ఎదురు కాల్పులు జరిపింది. నష్టం వివరాలు తెలియ రాలేదు.

జంటనగరాలలో నిషేధాజ్ఞలు

హైదరాబాద్, జూన్ 16— జంటనగరాలలో రేపు ఉదయం ఆరు గంటల నుంచి వారం రోజులపాటు నిషేధాజ్ఞలను అమలు పరుస్తూ పోలీసు కమిషనరు నేడు ఉత్తర్వులు జారీ చేశారు.

పంజాబ్ అసెంబ్లీ రద్దు చర్య

గవర్నరు పవాటే సమర్థన

న్యూఢిల్లీ, జూన్ 16— రాష్ట్ర శాసన సభను రద్దుచేస్తూ తాను తీసుకొన్న చర్యను పంజాబ్ గవర్నర్ శ్రీ డి. సి. పవాటె సమర్థించారు.

రాష్ట్రపతికి సమర్పించిన నివేదికలో, అనిశ్చిత పరిస్థితిని కొనసాగడానికి అనుమతించినట్లయితే ఆరోగ్యకరమైన రాజకీయ సంప్రదాయాల పెరుగుదల దెబ్బతినేదని ఆయన తెలియజేశారు.

గవర్నరు నివేదిక, రాష్ట్రపతి ఉత్తర్వు కాపీలను నేడు హోం శాఖ స్టేట్ మంత్రి శ్రీ కె. సి. పంత్ లోకసభకు సమర్పించారు.

రాష్ట్రపతికి పంపించిన తొమ్మిది పేజీల నివేదికలో పార్టీలను మార్చే శాసనసభ్యులు వివిధ రాజకీయ పార్టీలకు ఎప్పుడూ లొంగుతారని, అందువల్ల రాజకీయ ఒత్తిడులకు లొంగవలసిన పరిస్థితి ఏర్పడుతుందని. అటువంటి పరిస్థితిని కొనసాగనిస్తే, ఆరోగ్యకరమైన ప్రజాస్వామిక సంప్రదాయాల పెరుగుదలకు గాని, పరిశుద్ధమైన పరిపాలనకుగాని ఉపయోగపడదని. అందువల్ల, పరిస్థితులన్నింటినీ పరిశీలించిన తరువాత ముఖ్యమంత్రి సలహాను అంగీకరించినట్లు శ్రీ పవాటె ఆ నివేదికలో తెలియజేశారు.

దక్షిణ భారతదేశంలో తమ పర్యటన ముగించుకొన్న తరువాత రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి [illegible] సాయంత్రం ప్రత్యేక విమానంలో ఢిల్లీ తిరిగి వెళ్ళారు.

ఇంటర్ మీడియేట్ పరీక్షలు, ప్రత్యేక తరగతులు -
పాస్ గ్యారంటీ, హాస్టల్ ఫీజులు తక్కువ!
వెంకటేశ్వర ట్యుటోరియల్ కాలేజి
ఫోన్: 135 ★ నరసరావుపేట
మెట్రిక్, టెంత్‌క్లాస్ - ఇంటర్ మీడియేట్, పి.యు.సి. 1 నుండి 5వ తరగతి వరకు; హాస్టళ్ళు:- 5వతరగతి లోపు పిల్లలకు, హాస్టలు ఫీజు నెలకు రూ 50/- మాత్రమే, పైతరగతి విద్యార్థులకు హాస్టల్ ఫీజు నెలకు రూ 60/- మాత్రమే!
ప్రిన్సిపాల్ - టి. వెంకటేశ్వరరావు యం.ఎ.


ఆస్తి చూస్తే వంద ఎకరాలు, అంతస్తుకు మునసుబుగారి అల్లుడు. కాని భూస్వామిగా వుండక పద్మనాభం పూజలి గణపతిగానే వున్నాడు.... కారణం!
తప్పక చూడండి!
మా ఇలవేల్పు
శ్రీ కుమారస్వామి [illegible]

రేపే విడుదల
ఈ దిగువ కేంద్రములలో
[illegible]

విజయవాడ	—	శ్రీ సరస్వతి పిక్చర్ ప్యాలెస్
గుంటూరు	—	హరి హరమహల్
విశాఖపట్టణం	—	రాజేశ్వరి కళామందిర్
రాజమండ్రి	—	విజయాటాకీస్
కాకినాడ	—	పద్మనాభ టాకీస్
తెనాలి	—	అలంకార్ టాకీస్
ఏలూరు	—	రమా మహల్
భీమవరం	—	పద్మశ్రీ పిక్చర్ ప్యాలెస్
మచిలీపట్టణం	—	శ్రీ నటరాజ్ పిక్చర్ ప్యాలెస్
గుడివాడ	—	శ్రీ వెంకటేశ్వర్ థియేటర్
శ్రీకాకుళం	—	శ్రీనివాస మహల్
అమలాపురం	—	థియేటర్ డీలక్స్ (శ్రీ వెంకటేశ్వర)
తణుకు	—	రాయల్ టాకీస్
తాడేపల్లిగూడెం	—	శ్రీకృష్ణ బాలాజీ టాకీస్
చీరాల	—	శ్రీ గోపాలకృష్ణ టాకీస్
ఒంగోలు	—	శ్రీరామ్ పిక్చర్ ప్యాలెస్
పాలకొల్లు	—	రత్నం టాకీస్
హైదరాబాద్	—	సుదర్శన్ (A.C.), శ్యామ్ (A.C.)
సికింద్రాబాద్		చిత్రాణి
వరంగల్లు	—	రాజ రాజేశ్వరి టాకీస్
ఖమ్మం	—	శ్రీనివాస్ మహల్
తిరుపతి	—	జ్యోతి టాకీస్
కర్నూలు	—	నవరంగ్ టాకీస్
అనంతపూర్	—	నీలం థియేటర్
కడప	—	రౌనక్ పిక్చర్ ప్యాలెస్
బళ్ళారి	—	ముబారక్ టాకీస్



1971 జూన్ 17 గురువారం
శ్రీ విరోధికృతునామ సంవత్సర జ్యేష్ఠ బహుళ నవమి
నవమి ప॥ 3_30 ఉత్తరాభాద్ర ఉ॥ 8_41
వర్జ్యం: రా॥ 8_54 నుంచి 10_24 వరకు

• • •

1971 జూన్ 18 శుక్రవారం
శ్రీ విరోధికృతు నామ సంవత్సర జ్యేష్ఠ బహుళ దశమి
దశమి: ప॥ 1_01 రేవతి ఉ॥ 8_08
వర్జ్యం రా॥ 2_53 నుంచి 4_22 వరకు

ఆంధ్రజ్యోతి

"తమసోమా జ్యోతిర్గమయ"

శరణార్థుల సమస్య

బంగ్లాదేశ్ శరణార్థుల సమస్యను ఈ నాడు మేము మరొకసారి ప్రస్తావించడానికి కారణం ఇది ఒక్కొక్క రోజు గడుస్తున్నకొద్దీ మన ఏకైక సమస్యగా పరిణమించడమే. మనకిది తక్షణసమస్యగా, మహా ప్రమాదభరిత సమస్యగా కూడా రూపు ధరిస్తున్నది. దీని ముందుమిగిలిన సమస్యలు అప్రధానమైపోతున్నవి. ఇతర సమస్యలను గురించి ఆలోచనకే వీలులేకపోతున్నది.

మనకు ఈ సమస్య సంప్రాప్తమై రెండున్నర నెలలు దాటింది. ఇప్పటికి 55 లక్షల మందికి పైగానే తూర్పు బెంగాల్ శరణార్థులు మన దేశానికి తరలివచ్చారు ఇప్పటికీ రోజుకు లక్షమందిచొప్పున తరలివస్తూనే వున్నారు.

ప్రధాని ఇందిరా గాంధి నిన్న రాజ్యసభలో చెప్పినట్టు, ఇంత స్వల్పకాలంలో ఇంత భారీయెత్తున శరణార్థుల సమస్య ప్రపంచంలో ఏ దేశానికి, ఏ కాలంలోను తటస్థించివుండదు. ఒక్కసారిగా ఇన్ని లక్షల మంది పోషణ భారాన్ని, ఇతర సౌకర్యాల బాధ్యతను ఎన్నడు ఏ దేశం వహించి వుండదు.

ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాలు శరణార్థుల సమస్యను ఎదుర్కొనవలసి వస్తున్నది. దీనితో అవి ఉక్కిరి బిక్కిరై పోతున్నవి. వాటి పరిపాలనావ్యవస్థ యావత్తు ఈ సమస్యను ఎదుర్కోవడంలో నిమగ్నం కావలసి వస్తున్నది.

శరణార్థులకు ఆహార, తదితర సౌకర్యాల కల్పన ఒక సమస్య; శాంతి భద్రతలను కాపాడడం మరొక సమస్య; వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తపడడం ఇంకొక సమస్య— ఇన్ని సమస్యలను ఒక్కసారిగా సరిహద్దు రాష్ట్రాలేమి, కేంద్రప్రభుత్వ మేమి ఎదుర్కొనవలసి వస్తున్నది. శరణార్థులలో కలరా వ్యాధి వ్యాపించి వేలాదిగా మరణిస్తున్నట్టు వార్తలు వస్తున్నవి.

సరిహద్దు రాష్ట్రాలనుంచి ఇతర రాష్ట్రాలకు శరణార్థుల తరలింపు ప్రారంభమైంది నిజమే కాని, ఎన్ని లక్షల మందిని ఇతర రాష్ట్రాలలో సర్దినా, ఇంకా వచ్చేవారు వస్తూనే వుండగా ఈ సమస్యకు అంతుపొంతు వున్నట్టు కనిపించడంలేదు, శరణార్థులు తిరిగి తమ దేశం వెళ్ళడానికి అనుకూలమైన పరిస్థితులు అక్కడ ఏర్పడనంతవరకు ఈ సమస్య ఇండియాకు తప్పేటట్టు లేదు

వివిధ విదేశాలు శరణార్థులకు సహాయంగా శిబిరాలను, ఆహార పదార్థాలను, ఔషధాలను, తదితర సామగ్రిని పంపిస్తున్న మాట నిజమే. కాని, ప్రధాని నిన్న చెప్పినట్టు విదేశాలనుంచి అందుతున్న సహాయం అవసరమైన దానిలో పదవవంతు మాత్రమే. ఈ కొద్ది సహాయమైనా ప్రపంచ రాజ్యాలు ఎంతకాలంపాటు కొనసాగిస్తాయి?

శరణార్థులకు అవుతున్న వ్యయంలో అత్యధిక భాగాన్ని ఇండియాయే భరించవలసి వస్తున్నది. రోజుకు కనీసం కోటి రూపాయలు ఇందుకే ఖర్చుచేయవలసి వస్తున్నట్టు అంచనా. ఇండియావంటి పేద దేశం ఇంత భారీ వ్యయాన్ని ఎంతకాలం భరించగలదు? మరి కొన్ని నెలలు ఇదే విధంగా కొనసాగితే మన ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం కాదా? యుద్ధం చేయనవసరం లేకుండానే పాకిస్తాన్ ఇండియాను దివాలా తీయించినట్టు కాదా?

అందువల్లనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమార్గాలను ఆలోచించవలసి వున్నది. శరణార్థులను ఆదుకొనడం తక్షణావసరమైనా, వారిని స్వదేశం పంపివేయడానికి ప్రయత్నాలు జరగవలసి వున్నది.

తూర్పు బెంగాల్ సమస్యకు రాజకీయ పరిష్కారాన్ని కనుగొన్నప్పుడే అది సాధ్యం. ఈ విషయంలో ప్రపంచ రాజ్యాల బాధ్యతను గుర్తుచేసి వాటికి నచ్చచెప్పడానికి విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్, మరికొందరు మంత్రులు ప్రస్తుతం విదేశాలలో పర్యటిస్తున్నారు ఈ పర్యటనలు ఫలప్రదమైనట్టు నిన్న ప్రధాని చెప్పారు. అదే సమయంలో తూర్పు బెంగాల్ సమస్యకు రాజకీయ పరిష్కారావకాశం నానాటికి సన్నగిల్లుతున్నదనికూడా ఆమె అన్నారు. బహుశా పాకిస్తాన్ మూర్ఖత్వాన్ని దృష్టిలో పెట్టుకునే ఆమె ఈ నిరాశను వెల్లడించి వుండవచ్చు. ఏమైనా సమస్యపట్ల ఆందోళన వెల్లడించడం, ఇండియా, పాకిస్తాన్‌లకు రెంటికి సహనాన్ని బోధించడం తప్ప ఈ విషయంలో ప్రపంచ రాజ్యాలు యథార్థంగా చేస్తున్న కృషి ఏమీ కనబడదు.

వాటి వైఖరి ఇదే విధంగా కొనసాగితే శరణార్థుల సమస్య పరిష్కారానికి ఇండియా తనకు తానే దృఢచర్యలను గైకొనకతప్పదు. ఈ విషయమై త్వరలో ఒక నిర్ణయానికి రావడం అవసరం.

తెలంగాణా సమస్య పరిష్కారానికి చర్చల కొనసాగింపు

లోకసభలో హోం శాఖ స్టేట్ మంత్రి శ్రీ కె.సి. పంత్ ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 16 — తెలంగాణా సమస్యపై తెలంగాణా నాయకులతో చర్చలు కొనసాగుతున్నట్టు హోం శాఖ స్టేట్ మంత్రి శ్రీ కె.సి. పంత్ నేడు లోకసభలో చెప్పారు.

తెలంగాణా సమస్యకు రాజకీయ పరిష్కారం కనుగొనడానికి కొత్త పథకాన్ని తెలంగాణా నాయకులు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారా? అని కొత్త కాంగ్రెసు సభ్యురాలు శ్రీమతి టి. లక్ష్మీకాంతమ్మ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన పై విధంగా చెప్పారు.

శ్రీ పంత్ లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ, తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన సమస్యలను గురించి కొంతమంది తెలంగాణా నాయకులు వివిధ సందర్భాలలో చర్చలు జరిపారని చెప్పారు. అయితే, సమస్య పరిష్కారానికి "కొత్త పథకం" రూపొందించారా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పలేదు.

ఆగస్టునుంచి తెలుగు వాడుకభాష

రాష్ట్ర వ్యవసాయశాఖ ఉత్తర ప్రత్యుత్తరాలలో

హైదరాబాద్, జూన్ 16— జిల్లా స్థాయిలో వ్యవసాయ, పశుసంక్షేమశాఖలలో ప్రభుత్వేతర వ్యవహారాలలో 1971 ఆగస్టు నుంచి ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే జరపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

ప్రభుత్వం నిర్ణయించిన సందర్భాలలో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఇంగ్లీషును ఉపయోగించరాదని నిన్న విడుదలయిన పత్రికా ప్రకటనవల్ల తెలుస్తున్నది.

గుంటూరులో "మార్గదర్శి"

చిట్ ఫండ్ సంస్థ కార్యాలయానికి ప్రారంభోత్సవం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

గుంటూరు, జూన్ 16— మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రయివేట్ లిమిటెడ్ గుంటూరు బ్రాంచికి సీనియర్ డైరెక్టర్ శ్రీ తాతినేని వెంకటసుబ్బయ్య నిన్న ఇక్కడ ప్రారంభోత్సవం చేస్తూ, గత పది సంవత్సరాలుగా ఈ సంస్థ ప్రజలకు ఇతోధికంగా సేవ చేస్తున్నదని, ముస్ముందు కూడా చేయగలదని అన్నారు.

మార్గదర్శి ప్రతి వ్యక్తి కర్తవ్య నిర్వహణకు చేయూతగా వుండగలదని ఆయన అన్నారు. పట్టణంలోని ప్రతివారు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని తగు విధంగా ఆర్థికంగా లబ్ధి పొందాలని ఆయన విజ్ఞప్తిచేశారు

ఇప్పటివరకు హైదరాబాద్, సికిందరాబాద్, విజయవాడ, విశాఖపట్టణాలలో బ్రాంచీలను నెలకొల్పడం జరిగిందని, అవి దిగ్విజయంగా పనిని నిర్వహిస్తూ ప్రజామన్ననలను పొందాయని అన్నారు. ముస్ముందు ముఖ్య కేంద్రాలలో కార్యాలయాలను నెలకొల్పగలమని ఆయన వెల్లడించారు.

మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రామోజీరావు, డైరెక్టరు శ్రీ అప్పారావు ప్రభృతులు స్వాగతం పలికారు

కార్యాలయ ప్రారంభోత్సవానికి పలు ప్రముఖులు అనేకమంది వచ్చి తమ శుభాశీస్సులను అందజేశారు.

ప్రారంభోత్సవ సమయంలో వంద మందికి పైగా "మార్గదర్శి"లో సభ్యులుగా చేరి, తమ సహకారాన్ని అందజేశారు.

భారత ఉపఖండంలో విషమ పరిణామాలు

బంగ్లా సమస్యపై అమెరికా హెచ్చరిక

ఇండియాకు సహాయం చేయగలమని మరికొన్ని దేశాల హామీ

న్యూఢిల్లీ, జూన్ 16—

భారత ఉపఖండంలో నేడు ఘటిల్లుతున్న విషాదకర పరిణామాల ఫలితంగా భవిష్యత్తులో తీవ్రమైన ప్రమాదాలను ఎదుర్కొనవలసి రావచ్చునని అమెరికా భావిస్తున్నది.

అమెరికా ప్రభుత్వంతో సమాలోచనల నిమిత్తం ప్రస్తుతం అమెరికా వెళ్ళిన భారత దేశంలోని ఆ దేశ రాయబారి కెన్నెత్ కీటింగ్ తమ ప్రభుత్వం ఆందోళనను ఒక వ్యాసంలో వెల్లడించారు.

ఆయన ఈ వ్యాసాన్ని ఇక్కడ అమెరికా రాయబార కార్యాలయం తరపున వెలువడుతున్న "ది రిపోర్టర్"కు పంపించారు.

భారతదేశంలోకి అసంఖ్యాకంగా తూర్పు బెంగాల్ శరణార్థుల రాకవల్ల భవిష్యత్తులో భారత — పాకిస్తాన్ మధ్య సంబంధాలను గురించి తమ ప్రభుత్వం ఆందోళన చెందుతున్నదని కీటింగ్ తెలిపారు.

ఇవాళ కాకపోతే రేపైనా రాజకీయ పరిష్కారం ఒక్కటే మార్గం. అయితే ఆ పరిష్కారం త్వరలో కుదరగలదనే మేము ఆశిస్తున్నాం" అని కీటింగ్ అన్నారు.

రాజకీయ పరిష్కారం వల్ల శరణార్థుల సమస్యకు పరిష్కారం కుదరగలదని ఆయన అన్నారు. తద్వారా శరణార్థులు తమ దేశానికి వెళ్ళిపోగలరని అన్నారు.

మరికొన్ని దేశాలచే సహాయం ప్రకటన

పాకిస్తానీ సైనిక చర్యల ఫలితంగా బంగ్లాదేశ్‌లో ఉత్పన్నమయిన పరిస్థితిని ఎదుర్కొనడంలో తాము చేయగలిగిన సహాయంచేస్తామని హంగరీ, స్వీడన్ ఆస్ట్రియా, ఇటలీ దేశాలు ఇండియాకు హామీ యిచ్చాయి.

ఈ దేశాలను సందర్శించి ఈ రోజున ఢిల్లీకి చేరుకున్న కేంద్ర పరిశ్రమాభివృద్ధిశాఖ మంత్రి శ్రీ మొయినుల్‌హక్ చౌదరి ఈ విషయం ప్రకటించారు.

పరిస్థితి తీవ్ర స్వభావాన్ని గురించి తాను సందర్శించిన దేశాలప్రభుత్వాధిపతులు అర్థం చేసుకొన్నారని ఆయన అన్నారు.

త్వరలో సహాయం అందజేసి, పాకిస్తాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని తాను ఈ దేశాలకు విజ్ఞప్తి చేసినట్టు శ్రీ చౌదరి తెలిపారు.

ఇరాన్ మధ్యవర్తిత్వం

ఇండియా — పాకిస్తాన్‌లు కోరినట్టయితే తూర్పు బెంగాల్ సమస్యపై ఉభయదేశాల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతను సడలించడానికి తన పలుకుబడిని వినియోగించి మధ్యవర్తిత్వం నెరవగలనని ఇరాన్ ప్రకటించింది.

ఈ విషయం తాను రాజు షా పహ్లవీ నుంచి జనరల్ యాహ్యాఖాన్‌కు ఒక సందేశం తీసుకు వెడుతున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి ఇస్లామ్‌దేశాల ద్వితీయ శిఖరాగ్ర సభలో ప్రకటించారు.

వాషింగ్టన్‌కు శ్రీ స్వరణ్‌సింగ్ రాక

బంగ్లాదేశ్ శరణార్థుల సమస్య గురించి అమెరికా నాయకులతో చర్చించే నిమిత్తం భారత విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ నేడు వాషింగ్టన్‌కు చేరుకున్నారు.

శ్రీ సింగ్ ప్రకటన

తూర్పు బెంగాల్‌లో సైనిక నిర్బంధ విధానానికి స్వస్తిచెప్పించేందుకు, భారతదేశానికి వలసవచ్చిన శరణార్థులు తిరిగి తమ నివాసాలకు చేరుకొనేటట్లు మామూలు పరిస్థితులు కల్పించేందుకు ప్రపంచ దేశాలు వెంటనే చర్యలు తీసుకోవాలని శ్రీ స్వరణ్ సింగ్ నిన్న ఐక్యరాజ్యసమితి కార్యదర్శి ఊథాంట్‌తో చర్చల అనంతరం పత్రికల వారితో మాట్లాడుతూ అన్నారు.

ఊథాంట్‌తో చర్చల సందర్భంగా శ్రీ సింగ్‌తోపాటు సమావేశానికి భారత రాయబారి శ్రీ సమర్‌సేన్, విదేశాంగ శాఖ అధికారి, శ్రీ ఎస్. కె. సింగ్‌లు కూడా హాజరైనారు.

తూర్పుబెంగాల్ పరిస్థితులను తాను ఊథాంట్‌కు వివరించానని శ్రీ స్వరణ్‌సింగ్ చెప్పారు.

తూర్పు బెంగాల్‌లో మామూలు పరిస్థితులు ఏర్పడేటట్లు చేయడానికి తమ పలుకుబడినంతా వినియోగించవలసిందిగా తాను ఊథాంట్‌ను కోరానని శ్రీ సింగ్ చెప్పారు.

శ్రీ జయప్రకాష్ విజ్ఞప్తి

పాకిస్తాన్‌కు ఆర్థిక సహాయం చేయడం అంటే, అధికారంలో వున్న సైనిక ముఠాతో సహకరించడమేనని సర్వోదయ నాయకుడు శ్రీ జయప్రకాష్‌నారాయణ్ నిన్న ఒట్టావాలో పత్రికలవారితో మాట్లాడుతూ అన్నారు.

సైనిక చర్యలు నిలిపివేసేవరకు ఎలాంటి సహాయం అందించబోమని కెనడా, తదితర అభివృద్ధిచెందిన దేశాలు పాకిస్తాన్‌కు స్పష్టం చేయాలని శ్రీ నారాయణ్ కోరారు.

బంగ్లాదేశ్‌లో స్వాతంత్ర్యోద్యమం

పాక్ సేన అణచివేయజాలదని శ్రీ జగ్‌జీవన్‌రామ్ ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 16 — బంగ్లాదేశ్‌లో స్వాతంత్ర్యోద్యమాన్ని పాకిస్తాన్ సేనలు అణచివేయజాలవని రక్షణ మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ నేడు రాజ్యసభలో చెప్పారు.

శ్రీ కృష్ణకాంత్ అడిగిన అనుబంధ ప్రశ్నకు సమాధానమిస్తూ, స్వాతంత్ర్యోద్యమాన్ని పాకిస్తాన్ సేనలు అణచివేసినట్టు చెప్పడం తప్పు అని ఆయన అన్నారు.

స్వాతంత్ర్యయోధులు మరింత శక్తితో పాకిస్తాన్ సైన్యాన్ని చికాకుపరుస్తున్నారని శ్రీ జగ్‌జీవన్‌రామ్ తెలియజేశారు.

తూర్పు బెంగాల్‌లో సైనికుల అత్యాచారాలు

ప్రిన్స్ ఆగాఖాన్‌కు బంగ్లాదేశ్ అధ్యాపకుల మెమొరాండం

మిన్‌గామ్ (24 పరగణాల జిల్లా), జూన్ 16— తూర్పు బెంగాల్‌లో పశ్చిమ పాకిస్తాన్ సైన్యం అత్యాచారాలవల్ల ఏర్పడిన "అసహనస్థితి"ని వివరిస్తూ బంగ్లాదేశ్ యూనివర్సిటీ అధ్యాపకులు ప్రిన్స్ సద్రుద్దీన్ అగాఖాన్‌కు ఒక మెమొరాండం సమర్పించారు.

ఇక్కడ శరణార్థుల శిబిరాలను సందర్శించడానికి వచ్చిన ఐక్యరాజ్య సమితి హైకమిషనర్‌ను అధ్యాపకులు కలుసుకొని పూర్తి స్వాతంత్ర్యం తప్ప తూర్పు బెంగాల్ సమస్యకు పరిష్కారమార్గం లేదని చెప్పారు.

వస్త్రాల వాణిజ్యానికి బ్యాంకింగ్ సౌకర్యాలు

రాజ్యసభలో ఆర్థిక మంత్రి శ్రీ చవాన్ వివరణ

న్యూఢిల్లీ, జూన్ 16 — వస్త్రాల వాణిజ్యానికి ఎక్కువ బ్యాంకింగ్ సౌకర్యాలు కలిగించే విషయం ప్రభుత్వ పరిశీలనలో వుందని ఆర్థిక మంత్రి శ్రీ వై. బి. చవాన్ నిన్న రాజ్యసభలో చెప్పారు.

దేశంలో వస్త్రాల పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను గురించి శ్రీ ఎం. కె. మొహతా, శ్రీ జె. పి మాథుర్‌లు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ శ్రీ చవాన్ ఈ విషయం చెప్పారు.

భారతదేశంలో బ్రాంచి ప్రారంభించడానికి నెదర్లాండ్స్ బ్యాంకి అనుమతి ఇవ్వాలని వస్త్రాల వాణిజ్యవేత్తలు కోరుతున్నారని ఆయని చెప్పారు.

ఇంతకు ముందు ఈ కోర్కెను ప్రభుత్వం తిరస్కరించిందని, కాని, ఇప్పుడు ఆ దరఖాస్తు విషయం ప్రభుత్వం పరిశీలిస్తున్నదని శ్రీ చవాన్ చెప్పారు.

మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో అయిదు రోజుల సమావేశం 15 వ తేదీన కోయంబత్తూరులో ప్రారంభమైనది.

బంగ్లా వీరుని పరాక్రమ గాథ

కృష్ణనగర్, జూన్ 16— నిరాయుధుడై కూడా అత్యంత సాహసోపేతంగా పోరాడి 10 మంది శత్రు సైనికులను హతమార్చిన ఒక బంగ్లా అధికారి పరాక్రమగాథ నేడిక్కడ తెలియవచ్చింది.

ఖుల్నా జిల్లా సత్‌ఖిరా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని వరుసయావద్ద నిరాయుధంగా పాకిస్తాన్ సైనికులమధ్య చిక్కిన ఈ అధికారి శత్రు సైనికుల నుంచి అతి నైపుణ్యంతో ఒక లైట్ మెషిన్ గన్‌ను లాగుకొని సవ్యసాచివలె పరాక్రమించి ఒక్కడే 10 మందిని వధించినట్టు సరిహద్దు ఆవలివైపు నుంచి అందిన వార్తల వల్ల తెలుస్తున్నది.

ఇరువురు యువతులను పాక్ సేనల బారి నుంచి రక్షించడానికి ఈ అధికారి ఈ సాహసం చేశారు. అయితే ఒకరిని రక్షించగలిగాడు కాని రెండవ యువతిని రక్షించడానికి ప్రయత్నిస్తూ శత్రువుల కాల్పులకు గురి అయి నేలకొరిగాడు.

శ్రీ రామ్‌జైపాల్‌సింగ్ యాదవ్

బీహార్ ఉపముఖ్యమంత్రిగా నియామకం

పాట్నా, జూన్ 16—బీహార్ కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ నాయకుడు శ్రీ రామ్‌జైపాల్ సింగ్‌యాదవ్ ఉపముఖ్యమంత్రిగా నియమితులైనారు.

ముఖ్యమంత్రి శ్రీ భోలాపస్వాన్ శాస్త్రి, ఇతర క్యాబినెట్ మంత్రుల శాఖలను కూడా ప్రకటించారు.

ముఖ్యమంత్రి శ్రీ భోలాపస్వాన్ శాస్త్రి హోం, ఆర్థిక, పరిశ్రమలు, స్థానిక స్వపరిపాలన, పబ్లిక్ వర్క్సు శాఖలను నిర్వహిస్తారు.

శ్రీ రామ్‌జైపాల్‌సింగ్‌యాదవ్ సహకారం, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ శాఖ వాణిజ్యం, చక్కెర, విద్యుచ్ఛక్తి శాఖలను నిర్వహిస్తారు.

బ్రిటిష్ ఎం.పి.లతో తిరిగి చర్చలకు యాహ్యాఖాన్ సంకల్పం

కరాచీ, జూన్ 16 — తూర్పు బెంగాల్ పర్యటన అనంతరం బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుల బృందం తిరిగి చర్చలు జరపాలని ప్రెసిడెంటు యాహ్యాఖాన్ సంకల్పించినట్టు తెలుస్తున్నది.

ఢాకా వెడుతూ ఈ బృందం సభ్యురాలు జిల్‌నైట్ ఈ విషయం పత్రికా విలేకరులతో చెప్పారు.

సోవియెట్ నాయకులతో రాజు మహేంద్ర చర్చలు

మాస్కో, జూన్ 16— నేపాల్ రాజు మహేంద్ర నిన్న సోవియెట్ ప్రెసిడెంట్ పద్గోర్నీతో రెండు దేశాలమధ్య సంబంధాలను గురించి చర్చలు జరిపారు.

రాజు మహేంద్రకు ఇక్కడ ఘనంగా స్వాగతం చెప్పారు.

రాజ్యసభలో కొత్త కాంగ్రెసు బలం వందకు పెరుగుదల

న్యూఢిల్లీ, జూన్ 16— బీహార్ అసెంబ్లీనుంచి రాజ్యసభకు ఇద్దరు కొత్త కాంగ్రెసు సభ్యులు ఎన్నికకావడంతో 240 మంది సభ్యులుగల ఎగువ సభలో కొత్త కాంగ్రెసు బలం నూటికి పెరిగింది.

సభలో రెండవ పెద్ద పార్టీ అయిన పాత కాంగ్రెసు బలం కడచిన సంవత్సరం 40 వుండగా, ఇప్పుడు 32 కు తగ్గింది.

రాజ్యసభలో ఇతర పార్టీల బలాబలాలు: జనసంఘ్ 15, స్వతంత్రపార్టీ 11, కమ్యూనిస్టు 10. మార్క్సిస్టు 8, డి. ఎం. కె. 7, ఎస్. ఎస్. పి. 7, ముస్లింలీగ్ 4, బి. కె. డి. 4, పి. ఎస్. పి. 3, అకాలీదళ్ 3, రిపబ్లికన్ 2, మరి ఎనిమిది చిన్న పార్టీలవారు ఒక్కొక్కరు ఇండిపెండెంట్లు, ఇతరులు 31, ఖాళీలు 3.

బీహార్ షరీఫ్‌లో ముగ్గురి దుర్మరణం

పంచాయతీ ఎన్నికల సందర్భంగా

బీహార్ షరీఫ్, జూన్ 16— బీహార్ షరీఫ్ సబ్ డివిజన్ హిల్సా బ్లాక్‌లో నిన్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక సంఘటనలలో ముగ్గురు మరణించినట్టు, తొమ్మిది మంది గాయపడినట్టు తెలుస్తున్నది.

ఏడు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ఆపివేశారు. ఈ సందర్భంలో 60 మందిని అరెస్టుచేశారు.

అణు విద్యుత్ కేంద్రం స్థాపన

శ్రీమతి ఇందిరా గాంధి వివరణ

న్యూఢిల్లీ, జూన్ 16 — ఉత్తర, పశ్చిమ దక్షిణ విద్యుత్ మండలాలలో అణువిద్యుత్ కేంద్రం స్థాపనకు గల అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని లోకసభలో ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి చెప్పారు.

ఈ సందర్భంగా తగిన స్థలాల నిర్ణయానికి ఒక కమిటీని నియమించడం జరిగిందని, ఈ కమిటీ నివేదిక అందేవరకు స్థల నిర్ణయం జరుగుతుందని ఆమె చెప్పారు.

నిజాం గోల్డ్ కప్ ఫుట్ బాల్

డెంపో జట్టుపై జలంధర్ జట్టు గెలుపు

హైదరాబాద్, జూన్ 16— జలంధర్ సరిహద్దు భద్రతాదళం గోవాడెంపో జట్టుకు మధ్య నిన్న ఇక్కడ జరిగిన నిజాం గోల్డ్‌కప్ ఫుట్‌బాల్ సెమీ ఫైనల్స్‌లో జలంధర్ జట్టు గోవాజట్టుపై విజయం సాధించింది

జలంధర్ జట్టు రెండు గోల్సు చేయగా, గోవా జట్టు ఒక్క గోలు కూడా చేయలేదు.

బంగ్లాదేశ్ విప్లవం-ఆజాద్ ఎన్నడో ఊహించిన పరిణామం

తూర్పు బెంగాల్ ఏదో ఒకరోజున తన ఇష్టంవచ్చిన దారి తొక్కగలదన్న విషయం చాలమందికి ముందే తెలుసు. ఈ విషయాన్ని ముందే గుర్తించిన ప్రముఖుల్లో అగ్రగణ్యులు మౌలానా అబుల్ కలాం అజాద్.

ఆయన మరణానంతరం 1959 లో ప్రచురింపబడిన "ఇండియా విన్స్ ఫ్రీడం" అన్న ఆయన ఆత్మకథలో ఇలా వుంది:

"మతం విషయంలో తప్ప, మిగతా అన్ని విషయాలలోను ఈ రెండు ప్రాంతాల మధ్య పూర్తిగా భేదం వుంది, భౌగోళికంగాను, ఆర్థికంగాను, భాషా విషయకంగాను, సాంస్కృతికంగాను వేరైన ప్రాంతాలను ఒకేమతం ఏకం చేయగలదని చెప్పడం పెద్ద మోసం, జాతి, భాష, ఆర్థిక, రాజకీయమైన విభేదాలను అధిగమించడానికి ఇస్లాం మతం ప్రయత్నిస్తుం దనడం నిజమే. ఇస్లాం మతం అవతరణానంతరం కొన్ని దశాబ్దాలు గడిచిన తరువాత, అది ముస్లిం దేశాలన్నింటిని మతం ప్రాతిపదికగా ఒకే రాజ్యంగా ఏకం చేయజాలక పోయిందని స్పష్టమైపోయింది."

కాగా, అధికార వ్యామోహ పీడితులైన పాక్ సైనిక, పౌర పరిపాలకులు తమ సొంత ఇస్లాం చరిత్ర నేర్పుతున్న గుణ పాఠాలనే విస్మరించారు. తూర్పు బెంగాల్‌ను ఒక కాలనీవలె పరిగణించి దాన్ని దమన నీతితో దోపిడీ చేయటానికి ప్రయత్నించారు. అయినప్పుడు. తూర్పు పాకిస్తాన్ ప్రజలు బాహాటంగా తిరుగుబాటు చేయడంలో ఆశ్చర్యం ఏమున్నది?

పాకిస్తాన్ అవతరణనాటినుంచి తూర్పు బెంగాల్‌కు జరిగిన అన్యాయాలను గురించి, అవమానాలను గురించి డాక్టర్ జయంత కుమార్ రే తన "డెమొక్రసీ అండ్ నేషనలిజం ఆన్ ట్రయల్: ఏ స్టడీ ఆఫ్ ఈస్ట్ పాకిస్తాన్" అన్న గ్రంథంలో సోదాహరణంగా, సాధికారంగా వివరించారు. సిమ్లాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ వారు దానిని ప్రచురించారు.

1968 ద్వితీయార్థంలో దానిలోని ఆఖరి పేరాను వ్రాస్తూ డాక్టర్ రే "తన సమంజసమైన కోర్కెలను కార్యరూపం పొందించే ప్రజాస్వామిక శక్తులు పశ్చిమ పాకిస్తాన్‌లో తలెత్తేవరకు తూర్పు పాకిస్తాన్ బహుశా నిరీక్షించక తప్ప'దని అభిప్రాయపడ్డారు. కాని, పశ్చిమ పాకిస్తాన్‌లో అలాంటి శక్తులు తలెత్తలేదు. అలాంటి శక్తులు ఏ కొంచెమైనా తలెత్తినా, వాటికి తూర్పు పాకిస్తాన్ ఎడల సానుభూతిలేని భుట్టోవంటి వారు నాయకత్వం వహించారు.

కాగా, తూర్పు పాకిస్తాన్ మరి కొంతకాలం వేరై వుండడమంటే. దాని శృంఖలాలు మరింతగా బిగవడానికి అవకాశ మివ్వడమే మన్నమాట.

పోతే, "బంగ్లాదేశ్" అన్న మరో గ్రంథం కూడా ఇంతగాను ముఖ్యమైనదే. దానిలో ఎమ్. సి. ఛాగ్లా, వి. కె. కృష్ణమీనన్, ఎమ్. వి. సెతల్వాడ్, సి. కె. దఫ్తారీ కె. జి. సైదియాన్, ఎస్. ఎమ్. సింఘ్వీవంటి ప్రముఖులు "బంగ్లాదేశ్ గుర్తింపు. న్యాయశాస్త్ర. రాజకీయ నైతిక సమస్యలు" అన్న విషయంపై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కానిస్టిట్యూషనల్ అండ్ పార్లమెంటరీ స్టడీస్ సంస్థ జరిపిన ఒక గోష్ఠిలో వీరు, మరి కొందరు పాల్గొన్నారు. సుభాష్ సి. కాశ్యప్ వ్రాసిన పరిచయ అధ్యాయం ఈ సమస్య పూర్వాపరాలను చక్కగా వివరిస్తున్నది. దీనిలో ఇంకా ప్రెస్ డైజెస్ట్, మ్యాపులు, కార్టూన్లు, అనుబంధాలు వున్నాయి.

మొదటి పుస్తకం విస్తృతంగా, సూక్ష్మంగా పరిశోధించి వ్రాయగా, రెండవ గ్రంథం ఎంతో సమర్థంగా, త్వరితంగా ప్రచురింపబడడం మనకు సంతోషం కలిగిస్తుంది, నేడు బంగ్లాదేశ్‌లో జరుగుతున్న విషాద సంఘటనలను గురించి ఈ రెండు గ్రంథాలు చక్కగా వివరిస్తున్నాయి ఈ విషాదాంతం పరిణామాలు పాకిస్తాన్ పైనే కాకుండా, ఇండియా పైనకూడా ప్రభావం చూపిస్తున్నాయి, అగ్రరాజ్యాలు ఈ విషాదాంతానికి ఇప్పటి కైనా స్వస్తి చెప్పడానికి తాము చేయవలసినంత తీవ్రంగా కృషిచేయడం లేదు. మానవత్వపు విలువలన్నీ మానవ రక్తంలో మలినమైపోతుండగా అగ్రరాజ్యాలు ఇంకా తమ అధికార రాజకీయపు ఎత్తుగడలలో మునిగి తేలుతున్నాయి.

ప్రపంచ ప్రజలు తమకు తాముగా చొరవ తీసుకొనక పోతే, బంగ్లాదేశ్‌లో మానవత్వపు విలువలు మిగలబోవు.

Democracy and Nationalism on Trial: A Study of East Pakistan by Jayanta Kumar Ray. Indian Institute of Advanced Study, Simla-5. Rs. 23.

Bangla Desh ed. by Dr. Subhash C. Kashyap. National Publishing House, 23, Daryaganj, Delhi-6. Rs.18.

కుష్టియా రంగంలో పాకిస్తాన్ సేనలపై గెరిల్లాల సాహసం

30 మంది మృతి

ముజిబ్‌నగర్, జూన్ 16— బంగ్లాదేశ్‌లోని కుష్టియా రంగంలోని మెహర్‌పూరా ప్రాంతంలో బంగ్లాదేశ్ విమోచన దళాలు నిన్న కొత్తగా జరిపిన దాడులలో 30 మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు.

ముస్ముందు పాకిస్తాన్ సైనికులను ఖైదీలుగా పట్టుకొనబోమని, తమకు చిక్కినవారిని చంపివేయగలమని ముక్తిఫౌజ్ ప్రతినిధి చెప్పారు.

గత మే మూడవ తేదీనుంచి ఇప్పటివరకు తమ చేతులలో 823 మంది పాకిస్తాన్ సైనికులు నిహతులైనట్లు ఆయన చెప్పారు.

సల్దియా ప్రాంతంలో పాకిస్తానీలు తీవ్రనష్టాలకు గురియైనారని ఆయన అన్నారు.

దినాజ్‌పూర్ ప్రాంతంలో పాక్ సేనల దురంతాలు

బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పూర్ రంగంలో పాకిస్తాన్ సైన్యం రెండువేలకు పైగా ఇళ్ళను తగులబెట్టినట్టు ముక్తిఫౌజ్ అధికారులు చెప్పారు.

పాకిస్తాన్ సైనికులు ఠాంగిర్‌లోని మిరాజ్‌పూర్ ఆస్పత్రిని ఆక్రమించుకొని ఎదుగురు గర్భిణీ స్త్రీలతోసహా రోగులందరినీ తరిమివేసినట్టు వార్తలు అందాయి.

వారు డాక్టర్లు, నర్సులతోసహా ఆస్పత్రి సిబ్బందిపై దాడిచేసి, పలువురిని చంపివేసినట్లుకూడా తెలియవచ్చింది,

గాయపడిన సైనికుల చికిత్స కోసం వారు ఆస్పత్రిని వినియోగిస్తున్నారు.

బీహార్‌లో బంగ్లా శరణార్థులకు వసతి

వీలైనంతవరకు కల్పించగలమని ముఖ్యమంత్రి వివరణ

పూర్ణియా, జూన్ 16 — బంగ్లాదేశ్ శరణార్థులకు వీలైనంతమందికి వసతి చూపగలమని ముఖ్యమంత్రి శ్రీ భోలాపస్వాన్‌శాస్త్రి చెప్పారు.

శరణార్థులకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను తూ.చ. తప్పక పాటించగలమని ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

అమెరికా విమానం గౌహతిరాక

శరణార్థుల తరలింపు కార్యక్రమం నిమిత్తం

గౌహతి, జూన్ 16— ప్లయిడిన్, టార్పాలిన్ దేరాలతో అమెరికా సి-130 విమానం నిన్న ఢిల్లీనుంచి ఇక్కడికి చేరింది. ఈ విమానం అగర్తలా వెళ్ళి శరణార్థుల తరలింపు కార్యక్రమం ప్రారంభిస్తుంది.

మరొక సి-130 విమానంకూడా నేటినుంచి విమానంలో శరణార్థుల తరలింపు కార్యక్రమం నిర్వహిస్తుంది.

మేఘాలయకు శరణార్థుల సమస్య

రాష్ట్ర ఆర్థిక మంత్రి వివరణ

షిల్లాంగ్, జూన్ 16 — తూర్పు బెంగాల్‌లో సంఘటనలవల్ల, శరణార్థుల రాకవల్ల మేఘాలయ రాష్ట్రంపై తీవ్రమైన భారం ఏర్పడిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీ బి. బి. లింగ్డో చెప్పారు.

తూర్పు బెంగాల్ సంఘటనలు మొత్తం ఉపఖండంపై దుష్ప్రభావాన్ని ప్రసరించినవని ఆయన అన్నారు.

శరణార్థులకు ఆస్ట్రేలియా సహాయం

మెల్‌బోర్న్, జూన్ 16— తూర్పు బెంగాల్ శరణార్థుల కోసం, కలరా వ్యాక్సిన్, ఇతర పరికరాలు తీసుక వెడుతున్న ఆస్ట్రేలియా విమానం నిన్న కలకత్తాకు బయలు దేరింది.

35 టన్నుల బరువుగల ప్లాస్టిక్ షీట్స్, పసి పిల్లల ఆహారం, రెండు లక్షల మందికి ఇంజక్షన్‌కు వీలైన వ్యాక్సిన్ ఆస్ట్రేలియా ప్రభుత్వం పంపిస్తున్నది.

"బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని వెంటనే గుర్తించాలి"

కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రాజేశ్వరరావు విజ్ఞప్తి

కలకత్తా, జూన్ 16—భారతప్రభుత్వం వెంటనే బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని గుర్తించాలని, దీనివల్ల బంగ్లా స్వాతంత్ర్య యోధులకు ధైర్య, సాహసాలు సమకూరుతాయని కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రాజేశ్వరరావు అన్నారు.

అస్సాం, పశ్చిమ బెంగాల్, మేఘాలయలలో శరణార్థుల శిబిరాలను సందర్శించి వచ్చిన శ్రీ రావు, పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌ను గుర్తిస్తే, పాకిస్తాన్ సైనిక ప్రభుత్వంగాని, చైనా అవకాశవాద ప్రభుత్వంగాని ఇప్పటివరకు చేసిన దౌష్ట్యాలకంటె ఎక్కువేమి చేయగలవు? అని ప్రశ్నించారు.

బంగ్లాదేశ్‌లో ఆకలి చావులు

ప్రపంచం బ్యాంకి బృందం వెల్లడి

రావల్పిండి, జూన్ 16 — బంగ్లాదేశ్‌లోని తీర ప్రాంతాలలో ఆహారం కొరతవల్ల బెంగాలీలు మరణిస్తున్నారని ప్రపంచం బ్యాంకి బృందం వెల్లడించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది.

గత సంవత్సరం నవంబరు - తుపాను, ఉప్పెనలకు గురిఅయిన ప్రాంతాలే ఇప్పుడు ఆహారం కొరతను ఎదుర్కొంటున్నాయని ఈ వర్గాలవారు చెప్పారు.

తూర్పు బెంగాల్‌లో వేసవి పంటల దిగుబడిలో పది లక్షల టన్నుల మేర తగ్గవచ్చునని వ్యవసాయ నిపుణులు అంచనా వేస్తున్న సమయంలోనే ఈ వార్తలు అందినవి.

యాహ్యాఖాన్‌తో ప్రపంచం బ్యాంకి బృందం చర్చలు

న్యూఢిల్లీ, జూన్ 16 — ప్రపంచం బ్యాంకి అసిస్టెంట్ శాఖ డైరెక్టర్ పీటర్ కార్గిల్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు మధ్య ప్రాచ్యంశాఖ డైరెక్టర్ గుంథర్ వాకి ప్రెసిడెంటు యాహ్యాఖాన్‌తో చర్చలు జరిపారని పాక్ రేడియో వెల్లడించింది.

శరణార్థుల సమస్యపట్ల ప్రపంచ దేశాల బాధ్యత

రాజ్యసభలో చర్చకు సమాధానం చెబుతూ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి వివరణ

రోజు గడచినకొలదీ రాజకీయ పరిష్కారం దూరమౌతున్నదని హెచ్చరిక

న్యూఢిల్లీ, జూన్ 15— బంగ్లాదేశ్ శరణార్థులసమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం తన శక్తికొలదికృషిచేస్తుందని, అయితే, అదే సమయంలో తమ బాధ్యతనుంచి ప్రపంచ దేశాలు తప్పించుకోడానికి అనుమతించబోమని ప్రధాని శ్రీమతి గాంధి నేడు లోకసభలో ఉద్ఘాటించారు.

బంగ్లాదేశ్ శరణార్థుల సమస్యపై మూడు గంటలపాటు జరిగిన చర్చ సందర్భంలో జోక్యం కలిగించుకొని ప్రధాని ఈ విషయం చెప్పారు. ఆమె 20 నిమిషాలసేపు ప్రసంగించారు. ఇతర దేశాలనుంచి సహాయం వచ్చినా, రాకపోయినా ఉప ఖండంలో జరుగుతున్నదాని పరిణామాలనుంచి ప్రపంచ దేశాలు తప్పించుకోలేవని ప్రధాని ప్రకటించారు.

విదేశాలకు వెళ్ళిన మంత్రులుగాని, అధికారులుగాని ముష్టెత్తడానికి వెళ్ళారన్న ఆరోపణను ప్రధాని ఖండించారు. అటువంటి అభిప్రాయాన్ని కలిగించడానికి చేస్తున్న ప్రయత్నాలపట్ల విచారం వెలిబుచ్చి, "తమ బాధ్యతను ప్రపంచదేశాలు గుర్తించేటట్టు చేయడానికి మన మంత్రులు విదేశాలకు వెళ్ళారు. ఆ సమస్యను గురించి వారికి తెలియజేయవలసివుంది" అని శ్రీమతి గాంధి చెప్పారు.

ఈ మార్గంలో చేసిన ప్రయత్నాలు జయప్రదమైనాయని, ప్రపంచ వైఖరిలో మార్పు వచ్చిందని ప్రధాని చెప్పారు.

బంగ్లాదేశ్ సమస్యను రాజకీయంగా పరిష్కరించాలని చెప్పడంలో అర్థం, బంగ్లాదేశ్‌లో తమ హక్కులకోసం పోరాడుతున్నవారి వినాశంకాదని ప్రధాని వివరించారు.

కాని, రోజులు గడిచిన కొలదీ, రాజకీయ పరిష్కారం మరింత దూరం అవుతున్నదని ఆమె చెప్పారు.

శరణార్థులు ఎప్పటికైనా స్వదేశానికితిరిగి వెళ్ళవలసి వుందని. "వారు ఇక్కడ వుండడానికి అనుమతించ బోవడంలేదు. అలాగే కేవలం హత్యగావించబడడానికి వెళ్లేందుకు అనుమతించ బోవడంలేదు" అని శ్రీమతి గాంధి స్పష్టం చేశారు.

విదేశాలనుంచి భారత దేశానికి సహాయం వస్తున్నదని, కాని ఇంతవరకు వచ్చిన సహాయం అవసరమైన దానిలో ఏదోవంతు మాత్రమేనని ప్రధాని అన్నారు.

శరణార్థులపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపైన, ఆ సమస్య పరిష్కరించడానికి అనుసరిస్తున్న మార్గంపైన వస్తున్న విమర్శలను శ్రీమతి గాంధి ఖండించారు.

ఈ సమస్యను భారత ప్రజలు ధైర్యంగా ఎదుర్కొనగలరన్న పూర్తి విశ్వాసం తనకు వుందని ఆమె అన్నారు.

రాజ్యసభకు ఉప ఎన్నికలు

బీహార్ అసెంబ్లీ రెండుస్థానాలు కొత్త కాంగ్రెస్ కైవసం

పాట్నా, జూన్ 15 — బీహార్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రాజ్యసభకు నేడు జరిగిన ఉప ఎన్నికలలో రెండు స్థానాలను అధికార కాంగ్రెసు గెలుచుకొంది.

ప్రతిపక్షం కాంగ్రెసు నాయకుడు శ్రీ ఎస్. ఎన్. మిశ్రా, బీహార్ అధికార కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ ఎ. పి. శర్మ రాజీనామా చేయడంవల్ల ఈ ఉప ఎన్నికలు జరిగాయి, మార్చిలో జరిగిన ఎన్నికలలో లోకసభకు ఎన్నికైనందున వారు రాజీనామా ఇచ్చారు. గెలుపొందిన అభ్యర్థుల పేర్లు: శ్రీ బిల్ కిషోర్ ప్రసాద్, శ్రీ బిందేశ్వరీ ప్రసాద్ సింగ్.

"లైసెన్సింగ్ విధానంలో మార్పు జరగదు"

లోకసభలో మంత్రి వివరణ

న్యూఢిల్లీ, జూన్ 15 — ప్రస్తుతంవున్న లైసెన్సింగ్ విధానంలో మార్పులను ప్రభుత్వం తలపెట్టలేదని, లైసెన్సింగ్ వికేంద్రీకరణ సంకల్పం కూడా లేదని పారిశ్రామికాభివృద్ధి శాఖ ఉపమంత్రి శ్రీ సిద్దేశ్వరప్రసాద్ చెప్పారు.

కొన్ని లైసెన్సింగ్ అధికారాలను రాష్ట్రాలకు బదలాయించాలని రాజమన్నార్ కమిటీ తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో చేసిన సూచనపై ప్రభుత్వం అభిప్రాయ కమిటీని శ్రీ వి. కె. దేవ్ ప్రశ్నించగా శ్రీ ప్రసాద్ పై జవాబిచ్చారు.

సురేంద్రనగర్ జిల్లా కాంగ్రెసు కమిటీ సభ్యుడు శ్రీ విదూర్‌సింగ్ రణా 14 వ తేదీన పాతకాంగ్రెసునుంచి రాజీనామా చేసినట్టు సురేంద్రనగర్ వార్త.

కాంగ్రెసేతర పార్టీల ప్రభుత్వాలపట్ల కేంద్రం వైఖరి

ప్రాంతీయ పార్టీలకు శ్రీ ప్రకాశ్‌సింగ్ బాదల్ విజ్ఞప్తి

చండీఘర్, జూన్ 15— రాష్ట్రాలలోని కాంగ్రెసేతర ప్రభుత్వాలను కూలద్రోయడానికి కేంద్రం చేసే ప్రయత్నాలను అరికట్టడానికి ఐక్య కార్యాచరణకు సిద్ధం కావాలని పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ ప్రకాశ్‌సింగ్ బాదల్ నేడు ప్రాంతీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

ఇక్కడ పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ పెద్ద మెజారిటీతో కేంద్రంలో అధికారంలోవున్న కొత్త కాంగ్రెసు పార్టీకి, సభ్యులు పార్టీ ఫిరాయించేటట్టు చేయడానికి తగిన వనరులు వున్నాయని ఆయన చెప్పారు.

అధికార కాంగ్రెసు వంటి పెద్ద జాతీయ సంస్థ సూత్రాలను విస్మరించి, కాంగ్రెసేతర పార్టీలలో పార్టీల ఫిరాయింపులను బహిరంగంగా ప్రోత్సహించడంపట్ల శ్రీ బాదల్ విచారం వెలిబుచ్చారు.

104 మంది సభ్యులుగల సభలో తనకు 59 మంది లెజిస్లేటర్ల మద్దతు వున్నప్పటికీ అసెంబ్లీని రద్దుచేయమని సిఫారసు చేయవలసి వచ్చిందని ఆయన చెప్పారు.

ధనం, మంత్రి పదవులు ఇచ్చి అకాలీ లెజిస్లేటర్లను పార్టీ మార్చడానికి అధికార కాంగ్రెసు ప్రయత్నిస్తున్నదని శ్రీ బాదల్ ఆరోపించారు.

లెజిస్లేటర్ల పార్టీల మార్పిడిని శాసనం ద్వారా నిషేధించాలని ఆయన కోరారు.

ఈ సమస్యను గురించి పరిశీలించడానికి ప్రాంతీయ పార్టీల మహాసభను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకొంటారా? అని అడిగిన ప్రశ్నకు ఆ విషయం ముందుగా అకాలీదళ్ కార్యవర్గం సమావేశంలో చర్చించవలసి వుందని శ్రీ బాదల్ చెప్పారు.

సైన్యం వైదొలగితేనే స్వదేశానికితిరుగుపయనం

సమితి హైకమిషనర్ సద్రుద్దీన్‌కు తూర్పు బెంగాల్ శరణార్థుల స్పష్టీకరణ

కలకత్తా, జూన్ 16— పాకిస్తాని సైన్యం తమ దేశంలో (బంగ్లాలో) వున్నంతకాలం తాము తిరిగి అక్కడికి చేరుకోవడం సాధ్యపడదని బంగ్లా శరణార్థులు, ఐక్యరాజ్య సమితి హైకమిషనర్ ప్రిన్స్ సద్రుద్దీన్‌కు స్పష్టం చేశారు.

శ్రీ సద్రుద్దీన్ సమితి తరఫున కాందిశీకుల సమస్యలు చూస్తుంటారు.

శ్రీ సద్రుద్దీన్ నిన్న బంగోన్ (పశ్చిమ బెంగాల్) వద్ద వివిధ శరణార్థి శిబిరాలను సందర్శించిన సందర్భంగా శరణార్థులు ఒక మెమొరాండంలో పై విధంగా చెప్పారు.

ఆ మెమొరాండంలో వారు ఇంకా ఇలా చెప్పారు:

మే నెల ఆఖరి వారంలో రాజషాహి యూనివర్సిటీ ఫిజిక్స్ డిపార్టుమెంటు అధిపతి డాక్టరు రాకిబ్, గణాంకశాఖకు చెందిన లెక్చరర్ డాక్టర్ సాలే అహ్మద్‌లు తిరిగి పనిలో చేరిన సందర్భంగా వారిని పాక్ సైన్యం కాల్చి చంపింది.

అలాగే గత నెల మధ్యలో తిరిగి గోపాల్పూర్ చక్కెర మిల్లులో పనిలో చేరవచ్చిన 250 మంది కార్మికులను, ఇతర సిబ్బందిని కూడా సైన్యం చంపివేసింది.

వన్యప్రాణులు, పశువులు ప్రభుత్వ ఆస్తిగా పరిగణించడానికి ఉద్దేశించిన శాసనాన్ని చేయాలని తమిళనాడు ప్రభుత్వం సంకల్పించినట్టు మద్రాసు వార్త.

మెరిన్ డీజిల్ ఇంజన్ నిర్మాణం

జులై నెలాఖరుకు పూర్తి అవుతుందట

న్యూఢిల్లీ, జూన్ 16— మధ్యతరహా మెరీన్ డీజిల్ ఇంజన్ వచ్చే నెలాఖరుకు తయారవుతుందని రక్షణ శాఖ మంత్రి శ్రీ జగ్‌జీవనరామ్ రాజ్యసభలో చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇటువంటి ఇంజన్లు ఎన్ని తయారు చేస్తారని ఆయన శ్రీ కె. ఎల్. ఎన్. ప్రసాద్ అడిగిన ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

పూర్తిగా నిర్మాణం ప్రారంభించిన తరవాత రాంచీ ఫ్యాక్టరీ సంవత్సరానికి 60 మీడియమ్ ఇంజన్లను, పది అత్యున్నత శక్తిగల ఇంజన్లను తయారుచేయగలదని ఆయన చెప్పారు.

"1962 నాటి కంటె రక్షణ వ్యవస్థ మెరుగు"

శ్రీ జగ్‌జీవన్‌రామ్ ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 16— ఇండియా రక్షణ వ్యవస్థ చైనా దురాక్రమణ జరిగిన నాటి కంటె శక్తిమంతంగా వున్నదని, ఎట్టి దురాక్రమణనైనా ఎదుర్కొనగలమని రక్షణ మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ నేడు రాజ్యసభలో చెప్పారు.

1962 లో వలె చైనా ఆకస్మికంగా దాడి జరిపిన పక్షంలో దేశం వెనుకంజ వేయబోదని ప్రభుత్వం హామీ నివ్వాలని డాక్టరు భాయి మహావీర్ కోరగా మంత్రి పై సమాధానం చెప్పారు.

శ్రీ జగ్‌జీవన్‌రామ్ ఇంకా ఇలా అన్నారు:

"రక్షణ అవసరాలలో స్వయం సమృద్ధి సాధించడానికి కార్యక్రమాలు రూపొందించాము. ఆమేరకు తగు చర్యలు గైకొంటున్నాము. ఏ దేశమైనా దురాక్రమణ జరిపితే దాన్ని ఎదుర్కొనగలమని హామీ యిస్తున్నాము. దేశ రక్షణ వ్యవస్థ 1962 యుద్ధంనాటికంటె మెరుగుగా వుంది."

"చైనా దురాక్రమణను ఎదుర్కొనడానికి అవసరమైన ఆయుధాలను దేశం ఉత్పత్తి చేసినదా? విదేశాల నుంచి సమకూర్చుకొన్నదా?" అని శ్రీ కృష్ణకాంత్, శ్రీ జోకిమ్ ఆల్వా, శ్రీ ఎం. కె. మెహతాలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి మంత్రి నిరాకరించారు.

చైనా టి.యు.—16 జెట్‌బాంబర్లకు సాటి రాగల యుద్ధ విమానాలను సమకూర్చవలసిందిగా సోవియెట్ యూనియన్‌ను ఇండియా కోరిందా? అని శ్రీ మెహతా ప్రశ్నించారు. ఇండియా యుద్ధవిమానాలను తయారుచేస్తున్నదా? అని కూడా ఆయన అడిగారు.

రాడార్లు, ఇతర కమ్యూనికేషన్ల ఏర్పాట్లు జరిగినవా? అని శ్రీ కృష్ణకాంత్ ప్రశ్నించారు. చైనావద్ద వున్నటువంటి సామ్-3 రాకెట్లను సరఫరాచేయవలసిందిగా రష్యాను ఇండియా కోరినదా? అని కూడా ఆయన ప్రశ్నించారు.

యుద్ధ విమానాలను ఇండియా తయారుచేస్తున్నదని ఒక ప్రశ్నకు రక్షణ మంత్రి సమాధానం చెప్పారు. కాని, ఏ రకం విమానాలు తయారు చేస్తున్నదీ వెల్లడించడానికి నిరాకరించారు.

ఎలక్ట్రానిక్ వ్యవస్థను అభివృద్ధి చెందిన దేశాలతోపాటు అభివృద్ధి చేయడానికి ఇండియా ఇప్పుడు ప్రయత్నిస్తున్నదని శ్రీ చంద్రశేఖరన్ ప్రశ్నకు మంత్రి బదులు చెప్పారు.

చైనా ప్రస్తుతం రష్యన్ టి.యు.—16 జెట్ బాంబర్లను తయారు చేస్తున్నట్టు ప్రభుత్వానికి సమాచారం అందినదని మరొక ప్రశ్నకు రక్షణమంత్రి బదులు చెప్పారు.

రష్యా సహకారంతో చైనా ఈ బాంబర్లను తయారుచేస్తున్నట్టు సమాచారం లేదని, రష్యా సహాయం వుండదని తాను భావిస్తున్నానని ఆయన అన్నారు.

ఆ బాంబర్లను చైనా సోవియెట్ యూనియన్‌పై ఉపయోగించే ప్రమాదం కలదని ప్రభుత్వం భావిస్తున్నదా? అని శ్రీ అర్జున్ అరోరా ప్రశ్నించారు.

ప్రస్తుతం రష్యా, చైనాల మధ్యగల సంబంధాలదృష్ట్యా సభ్యుడు చెప్పినదానికి అవకాశం లేకపోలేదని శ్రీ జగ్‌జీవన్‌రామ్ చెప్పారు.

బంగ్లాదేశ్ సమస్యపై కేంద్రం వైఖరిలో మార్పు?

ప్రతిపక్ష నాయకుల భయసందేహాలు

న్యూఢిల్లీ, జూన్ 15— బంగ్లాదేశ్ స్వాతంత్ర్య ఉద్యమానికి, శరణార్థుల పునరావాసానికి కేంద్ర ప్రభుత్వం చేయవలసినదంతా చేయడం లేదనే అభిప్రాయం నేడిక్కడ జరిగిన ప్రతిపక్ష నాయకుల సమావేశంలో వ్యక్తమయింది.

స్వతంత్ర బంగ్లాదేశ్ అవతరణకు దోహదంచేసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఇంతకుపూర్వం చేపట్టిందని, ఇప్పుడు తూర్పు, పశ్చిమ పాకిస్తాన్‌ల మధ్య ఏదో ఒక విధమైన రాజకీయ పరిష్కారంకోసం ప్రయత్నిస్తున్నదని ఒక ప్రతిపక్ష నాయకుడు విమర్శించారు.

బంగ్లాదేశ్ సమస్య పాకిస్తాన్ అంతరంగిక సమస్య అని, ప్రధాని అస్సాంపర్యటనలో పేర్కొన్నట్టు వచ్చిన వార్తపై కొందరు ప్రతిపక్ష నాయకులు తీవ్రమైన భయ సందేహాలను వ్యక్తపరిచారు.

బంగ్లాదేశ్ సమస్యపై కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడానికి అఖిలపక్ష కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పార్లమెంటులోను, పార్లమెంటు వెలుపల కూడా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు.

బంగ్లాదేశ్ పట్ల కేంద్ర ప్రభుత్వం వైఖరి గురించి వున్న కొన్ని అపోహలపై ప్రధానినుంచి వివరణ పొందడానికి శ్రీమతి గాంధితో చర్చించాలని ప్రతిపక్ష నాయకులు నిర్ణయించారు. ఇందుకు ప్రతిపక్ష నాయకుల ప్రతినిధివర్గం త్వరలో ప్రధానితో చర్చలు జరుపుతుంది.

బంగ్లాదేశ్ శరణార్థుల పునరావాసానికి గైకొన్న చర్యలను పరిశీలించడానికి పార్లమెంటు సభ్యుల బృందాన్ని పశ్చిమ బెంగాల్, అస్సాంలకు ప్రభుత్వం పంపాలని కోరారు.

బ్రిటిష్ కామన్స్ ప్రతినిధివర్గం బంగ్లాదేశ్ వెళుతుంటే ఇండియన్ పార్లమెంటు ప్రతినిధివర్గం పశ్చిమ బెంగాల్, అస్సాంలకు వెళ్ళకపోవడంపట్ల పెక్కుమంది విస్మయం ప్రకటించారు.

అధికార కాంగ్రెసుకు ప్రత్యామ్నాయ పార్టీ

జనసంఘం కాగలదని శ్రీ జగన్నాథరావు జోషి ఆశాభావం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాదు, జూన్ 16— శాసనసభలకు వచ్చే సంవత్సరం జరుగనున్న జనరల్ ఎన్నికలలో జనసంఘం అధికార కాంగ్రెసుకు ప్రత్యామ్నాయ రాజకీయ పక్షం కాగలదని భారతీయ జనసంఘం కార్యదర్శి శ్రీ జగన్నాథరావు జోషి నేడిక్కడ అన్నారు.

ఆయన నేటి ఉదయం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మితవాద పార్టీలతో పొత్తుపట్ల జనసంఘానికి విశ్వాసం లేదని అన్నారు.

స్వతంత్ర పార్టీ, ప్రతిపక్ష కాంగ్రెసు ప్రజాభిమానాన్ని చూరగొనలేకపోయినవని బాగా నిరూపణ అయినట్టు ఆయన విమర్శించారు.

